# 11
# పడగనీడ

"మార్పు అవసరమేకదా...!" నా సమాధానం.

"ఈ మార్పు ఎవరిని ఉద్ధరించింది...?" దేవేందర్ ప్రశ్న

"మార్పు వల్లనే గదా... సస్యవిప్లవాన్ని సాధించాం. షిప్‌టు మౌత్‌నుండి గోదాముల నిండా ధాన్యపు నిలువలను సాధించాం. ఎద్దు నడవాలె... నాగలి దున్నాలె. అని కూర్చుంటె ఇన్ని కోట్ల జనాభాకు తిండి దొరికేదేనా...? నేడు ఆహారపు కొరతనే లేదంటే అది మార్పువల్ల కాదా...?"

నేను కొత్తగా చూస్తున్నట్టు దేవేందర్ నావైపు వింతగా చూసాడు. ఆ చూపుకు కారణం ఉంది.

నిన్న మొన్నటివరకూ నేను దేవేందర్‌ను సమర్థించేవాడినే. ఇద్దరం కలిసి యాంత్రీకరణ, హరిత విప్లవాలమీద దుమ్మెత్తి పోసేవాళ్లం. సంస్కృతి విడదీయరానిదని సంస్కృతి విధ్వంసం జీవన విధ్వంసమేనని మనసు విలవిలలాడేది.

రవి నా అభిప్రాయాన్ని పూర్తిగా మార్చేసాడు. చేనేత సంరక్షణ సమితి సెమినార్‌లో పరిచయమయ్యాడు రవి. మంచి మాటకారి. చెప్పినదాన్ని సహేతుకంగా వివరిస్తాడు.

అతలాకుతలమైన చేనేత బతుకులు ఆత్మహత్యలు గురించి నా వాదన విన్నాక ఒకే ఒక ప్రశ్నను అడిగాడు రవి.

"ఇదే బట్ట క్వాలిటీతో ఇంతకంటే మంచి ఫినిషింగ్‌తో ఇందులో సగం ధరకే బయట మిల్లులో దొరుకుతుంటే ఈ నేతబట్టను ఎవరు కొంటరు...? ఎందుకు కొంటరు..?" అని.

నేను సమర్థించుకున్నాను. ఆత్మహత్యల సంగతి చెప్పాను. రవి ఒప్పుకోలేదు. "మార్పుతో కోట్లమంది బాగుపడుతరు. వందలమంది బాధపడుతరు. దేనిని ఒప్పుకుందాం. దేనిని ఆమోదిద్దాం..." అంటూ కొత్తనీరు పాతనీరు కథ చెప్పాడు రవి.

ఆదేమిటంటే కొత్త నీరువస్తే పాతనీరు ఎలాగూ కలుషితమవుతుంది. కొత్తలో కలరానో టైఫాయిడో వచ్చినా వెంటనే సర్ధుకుంటుంది. నీళ్ళు తొందర్లోనే పేరుకుని మంచినీళ్లవుతాయి. ఈ మార్పులకు భయపడి కొత్త నీళ్లకు అడ్డుకట్టవేస్తామా...?" ఒకవేళ వేస్తామే అనుకో. పాత నీళ్లతో ఎన్ని రోజులు సరిపుచ్చుకుంటాము...? అని ప్రశ్నించాడు రవి.

" మరి అతలాకుతలమైన బతుకుల సంగతేమిటి..?" రవిని అడిగాను.

అడిగిందే అడిగినట్టు నావైపు విసుగ్గా చూసాడు రవి. అదీ కొద్దిసేపే! తర్వాత మామూలుగానే "కాదు డాక్టర్ గారూ... మార్పు ఒక యుద్ధంలాంటిది. ఎంతోకొంత రక్తపాతం తప్పదు. పాతనీరు కొత్తనీరు కలిసినప్పుడు తట్టుకోలేని చేపలు కొన్ని ఎగిరెగిరి పడుతాయి. కొన్ని నీటికి ఎదురీది నిలదొక్కుకుంటాయి. సంధికాలంలో ఎదురీదడం నేర్చుకోవాలి" అన్నాడు.

వీరు వారు కావడానికి వారం పట్టింది. ఈ వారంలో రవీ నేను గ్లోబల్ మార్పులు హరిత, నీలి, శ్వేత, విప్లవాలనుంచి ప్రపంచ మార్కెట్ దాకా చర్చించుకున్నాం.

అప్పుడు నా అభిప్రాయమే మారిపోయింది. సామాజిక పరిణామక్రమంలో ఏ కాలంలోనైనా మార్పును వ్యతిరేకిస్తూ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. అనివార్యమైన మార్పును ఉపయోగకరమైన ఆవిష్కరణను ఆపలేం. ఆపడం అంత ఆరోగ్యంకాదని కూడా నాకు అనిపించింది.

అదే విషయాన్ని ఇప్పుడు దేవేందర్‌తో చర్చిస్తున్నాను. నాలోని మార్పును జీర్ణించుకోలేకపోతున్నాడు దేవేందర్.

"కాదు దేవేందర్... చేనేత పరిశ్రమనే తీసుకుందాం. పవర్‌లూం వచ్చింది కాబట్టి సరిపోయింది. మగ్గంతోనే నెయ్యాలె మనమే తొడగాలంటె ఇన్ని కోట్ల జనాభాకు బట్టలు అందేవేనా...?" అడిగాను.

దేవేందర్ అదే స్థాయిలో "నువ్వు మార్పును కేవలం ఇన్వెస్టిగేషన్, ఇనుస్ట్యుమెంట్స్ డిస్కవరీ రూపంలోనే చూస్తున్నావు. వార్మింగ్‌ను సృష్టించే పరిస్థితులను అర్థం చేసుకోవడంలేదు" అన్నాడు.

స్వప్న టీ తెచ్చి టేబుల్‌మీద పెడుతూ "పొద్దున్నే కూర్చున్నారు. క్యాంప్ సంగతి మరిచిపోయారా." గుర్తు చేసింది.

టైం చూసుకున్నాను. ఎనిమిదీ పది. టీ అందుకుని తాగుతూ "యాంత్రిక విప్లవం చాలా

మేలు చేసింది దేవేందర్... యంత్రాల వల్ల ఉత్పత్తి పెరిగింది. రేటుతగ్గింది. ఉత్పత్తుల అమ్మకం కోసం కొత్తగా పెద్ద మార్కెట్‌లు ఏర్పడ్డాయి. పని కోల్పోయిన కార్మికులకంటే రెట్టింపు కార్మికులకు ఈ మార్కెట్‌లో పని దొరికింది." అన్నాను.

"డాక్టర్... నువ్వేదైనా బిజినెస్ చెయ్యబోతున్నావా..." టాపిక్‌మార్చి హఠాత్తుగా అడిగాడు దేవేందర్.

కప్పు టేబుల్ మీద పెడుతూ " ఎందుకు...?" అన్నాను.

" ఏం లేదు ... మనిషి కమర్షియల్‌గా మారేప్పుడు అంతకుముందు నమ్మిన సిద్ధాంతాలను మార్చుకుంటాడు. దగ్గరి వాళ్లను మార్చాలని ప్రయత్నిస్తాడు" అన్నాడు నవ్వుతూ.

నాకు నవ్వొచ్చింది. నన్ను ఏ విధంగా అంచనా వేసాడో అర్థమయింది.

దేవేందర్ మంచి కవి. మనిషిలో పారదర్శకత ఉంది. రాతల్లో జీవితంలో ఒకేలాగుంటాడు. అతడన్నా అతడి రచనలన్నా నాకు చాలా ఇష్టం. ప్రైమరీ స్కూల్ టీచర్‌గా పనిచేస్తున్నాడు.

స్వప్న మెడికల్ క్యాంపు గురించి మరోసారి గుర్తుచేసింది. ఈ సారి గొంతులో విసుగుంది. చర్చలు మాటలు సభలూ సమావేశాలు పనికిమాలిన పనులని ఆమె అభిప్రాయం. ఇంటివద్ద ప్రాక్టీసు పెడితే ఎంతో డబ్బు సంపాదించవచ్చునంటుంది. నన్ను రోజూ హెచ్చరిస్తుంది కూడా.

మా మాటలు క్యాంప్ మీదికి మళ్లాయి.

"ఏ ఊరు...?" దేవేందర్ అడిగాడు.

"అన్నట్టు మరిచాను. మీ ఊరే! లింగంపెల్లి. ఏదో వింత వ్యాది సోకిందట. వారంలో పదిమంది పిల్లలు చనిపోయారట. క్యాంపు వేయాలని కలెక్టర్ అర్డర్. ఊరు పెద్దదేనా...?" అడిగాను.

అడిగిన తర్వాత గుర్తొచ్చింది దేవేందర్ 'నా ఊరు' పోయమ్. 'అగ్గిమీద బొర్రిత్తే సువ్వపోయిన సొరకాయ...ఎండిన సొంటికొమ్ము...పాలుగాదు రక్తం కారుతున్న తల్లి రొమ్ము.. నా ఊరు.' అంటాడు అందులో.

సమాధానం చెప్పలేదు. చిన్నగా నవ్వాడు దేవేందర్. నవ్వుతూ లేచాడు.

ఎప్పటినుంచి ఉగ్గబట్టుకుందో స్వప్న. దేవేందర్ వెళ్లబోతుంటే "అన్నయ్యా సోనికి రోజుకో పీరియడ్ చెప్పండి. చుట్టు పక్కల పిల్లలుగూడా వస్తరు" అన్నది.

సోనీ నాకూతురు. సెవెంత్ క్లాస్. రెండు ప్రైవేట్లు చెప్పుకోక ఎందుకీనస అన్నది ఆమె ఆలోచన. ఈ విషయంలో దేవేందర్ భార్యకూడా స్వప్న మాటలనే బలపరుస్తుంది. వాళ్లిద్దరు కలిసి మమ్మల్ని సంస్కరించే పనిలో ఉన్నారు.

స్వప్న మాటల్ని ఎలా అర్థం చేసుకున్నాడో గాని "రేపే ఒక టీచర్‌ని ఏర్పాటు చేస్తా" అని నవ్వుతూ తిప్పికొట్టి బయటకు నడిచాడు దేవేందర్.

*****

ఊరు నిజంగా సువ్వపోయిన సొరకాయలా ఉంది. అప్పుడే జీపులో రెండు రౌండ్లు వేసి వచ్చాం. కూలిన గోడలు, తాళాలు యాలాడుతున్న ఇండ్లు. పొక్కిలితో వాకిండ్లు. దైన్యం నిండుకున్న మొఖాలు. తల్లి రెక్కల కింద భయం భయంగా ఒదిగిన కోడి పిల్లలా మౌనంగా దిగులుగా ఉంది ఊరు.

విచిత్రమేమిటంటే ఊరిలో పిల్లలు వృద్ధులూ తప్ప యువకులు కనిపించడంలేదు. స్కూల్లో క్యాంపు. నేనూ మరో ఇద్దరు జూనియర్లు ఇద్దరు ఏఎన్నెమ్‌లున్నాం. ఎవరి పనుల్లో వాళ్లున్నారు. చిన్న పిల్లల్ని ఎత్తుకుని వస్తున్నారు. పేర్లు రాసుకుని సంతకాలు తీసుకుని టెస్టులు చేస్తున్నాం. మందులిస్తున్నాం. రోగనిర్ధారణ మాత్రం కావడంలేదు.

వారంరోజుల కింద వరుసగా నలుగురు పిల్లలు చనిపోవడంతో ఊరు వార్తల్లోకి ఎక్కింది. ముందుగా చర్మంమీద పొక్కులు. వెంటనే జ్వరం. తీవ్రమైన జ్వరం. కోమాలోకి వెళ్తే శవమే లేస్తుంది. ఆ వ్యాధి వచ్చిన పిల్లలెవరూ బతకలేదు. శాంపిల్స్‌ను లాబ్‌కు పంపాము. రిజల్ట్స్ రాలేదు. ముందు జాగ్రత్తగా యాంటీబయాటిక్స్ ఇస్తున్నాం. ఎవరికి జ్వరం వచ్చినా చర్మంమీద పొక్కులు వచ్చినా క్యాంపుకు రావాలని చాటింపు వేయించాం.

మధ్యాన్నమయింది పేషెంట్స్ తగ్గిపోయారు. మిగతా స్టాఫ్ మాట్లాడుకుంటున్నారు. నేను బయట నిలబడి చూస్తున్నాను. ఎండిన రక్తంమరకల్లా జాజుపట్టీలు...ఊరు చుట్టూ ఎడారిలాంటి బీడుపొలాలు...విరిగి పైకి పొడుచుకు వచ్చిన ఎముకల్లా వట్టిపోయిన బోర్లు. మనుషులు ఎండిపోయిన నల్లతుమ్మ పుల్లల్లా ఉన్నారు. ఊరుఊరంతా ఆకు రాల్చుకున్న చింతచెట్టులా ఉంది.

దేవేందర్ పోయమ్ మరోసారి గుర్తొచ్చింది. 'గీత గీతకూ వంపులు తిరిగి నొక్కులు వడ్డ ఎండిపోయిన ఈతచెట్టు లాంటి నా ఊరు ఒకనాడు బాలింతరాలు...' అంటాడు.

హోటల్‌నుండి టీ వచ్చింది. దాహంగా ఉంటే గ్లాసులో నీళ్లు అందుకుని తాగాను. గుక్కెడు నీళ్లు గొంతు దిగినాయో లేదో సరానవడ్డది. నీళ్లు ఉప్పుగా ఉన్నాయి. గ్లాసు మీద తెల్లగా సుద్దకట్టు. నోట్లోని నీళ్లను ఉమ్మేసి టీ అందుకున్నాను. అదిగూడా సహించలేదు. కింద పెట్టేసాను.

అప్పుడే ఒక వ్యక్తి వచ్చాడు. వయసు యాభైదాటే ఉంటుంది. మొఖం నిండా తెల్లటి గడ్డం. జుట్టు నెరిసి ఉంది. భుజం మీద మాసిపోయిన పంచె బుడ్డగోచి తప్ప శరీరం మీద ఏ అచ్ఛాదనా లేదు. కొద్దిగా వణుకుతున్నాడు.

దగ్గరగా పిలిచి విషయం అడిగాను.

కండ్లు లోతుగా ఉన్నాయి. లోతైన కండ్లలో తడి ఉంది. గొంతు పెగల్చుకుని చెప్పాడు. "సార్... మా గంగుబాయి సార్...బాగాలేదు...."

"ఏమయింది..." ఆతృతగా అడిగాను. చిన్నపిల్ల అనుకొని.

"తెలువది సార్...పూర్తిగా ఎండుకపోతుంది."

"ఎప్పటినుంచి"

" నాలుగేండ్లు దాటింది సార్... సరిగ్గా ఇదే దినం. యాసంగి నాట్లమీద బోర్లవద్దది... ఎవలకు చూపించినా రోగానికి తగ్గమందు ఇస్తలేరు. మీరైనా చూసి మందు ఇయ్యండి సార్..." అన్నాడు.

" గంగుబాయి ఏమైతది." కొద్దిగా స్థిమితపడి అడిగాను. అతడు కదిలిపోయాడు. గొంతులో ఏడుపు ఒక్కటే తక్కువుంది. "తల్లి సార్... నా తల్లి, నలుగురు పిల్లల్ని కనిభూమ్మీద పడేసిపోయింది నాభార్య. నా తల్లే వాళ్లను పోషకర్తన చేసింది సార్..." ఆ కళ్లల్లో తడి.

ముందుగా అతడు చెబుతుంటే ఎవరో చిన్నపిల్ల అనుకుని కంగారు పడ్డాను. కాదని తెలిసాక మనసు కొంత కుదుటపడింది. ఈ వయసులో అతడు తల్లి గురించి పడుతున్న ఆరాటం చూసి బాధకలిగింది.

"నలుగురు పిల్లలన్నావుగదా... వాళ్లురాలేదా...?" అడిగాను.

"రెక్కలచ్చిన పచ్చులుగద సార్... పాలుదాగిన రొమ్మును తన్ని ఎగిరిపోయింద్రు. నా తల్లిని మీరే కాపాడాలె సార్... అది ఎప్పటిలా గలగల నవ్వాలె...ముందటిలా నిండుగా ఉండాలె..." అంటూ నా కాళ్ల మీద పడ్డాడు.

అ వయసులో అతడికి తల్లి మీదున్న ప్రేమ నన్ను కదిలించింది. లేవనెత్తి ఓదార్చాను. మెడికల్ కిట్ అందుకుని అతడి వెంట నడిచాను.

అతడు కండ్లు తుడుచుకున్నాడు. బలవంతాన నా కిట్ బ్యాగును పట్టుకుని ముందు నడుస్తున్నాడు. ఎండాకాలం ఇంకా మొదలుకానే లేదు. అయినా ఎండ సుర్రుమంటుంది. వేడిగాలి వీస్తుంది. ఎండకు రోడ్డుమీది ఇసుక మెరుస్తుంది.

దారి పొడుగునా అతడు తల్లి గురించే చెబుతున్నాడు. నేను 'ఊ' కొడుతూ నడుస్తున్నాను. దారిలో కలిసినవాళ్లు మమ్మల్ని మార్చి మార్చి చూస్తున్నారు. ఏదో గొణుక్కుంటున్నారు. మాటల్లో ఇద్దరం ఊరు దాటాం.

" ఊరు దాటినం గదా..ఎక్కడ మీ ఇల్లు" అడిగాను.

"ఎక్కడి ఊరు సార్... ఊరు ఎన్నడో నన్ను వేరు చేసింది. ఇప్పుడు ఊరి బయటనే గుడిసె వేసుకున్నాం." అన్నాడు నడుస్తూ.

ఇద్దరం మడికట్ల తొవ్వ పట్టాం. అన్నీ బీడు భూములే!

“మొన్నమొన్నటి వరకు ఇవి పంట భూములుసార్... మూడు పంటలు బంగారం పండింది. ఊరు పాలపొదుగులా ఉండేది సార్... ఎక్కడ ఏమయిందో... మాయల మరాటీ చేతుల బాలనాగమ్మ కర్రె కుక్క అయినట్టు పచ్చని పొలాలు బీడు భూములయినయి. పచ్చని సంసారాలు ఇచ్చుకపోయినయి. పాలకుండ లాంటి ఊరు ఉత్తకుండయింది. చెట్టుకొకలు గుట్టకొకలు పారిపోయింద్రు...” అతడు చెబుతున్నాడు. ఆ మాటల తీరు నన్ను అకట్టుకుంది. చుట్టూ చూస్తూ నడుస్తున్నాను.

అతడు చెప్పిన ఆనవాళ్లు కనబడుతున్నాయి. పెద్దపెద్ద పొలంమడ్లు. అక్కడక్కడా బాయిలు,లిఫ్టులు, కరంటుమోటర్లు, అన్నీ ఎండుకపోయినయి. నెర్రెలు వారినయి. ములుపుచ్చముండ్లు మొలిచి బీడువడ్డయి.

ఇద్దరం ఒక మామిడిచెట్టుకింద అగాం. చెట్టు నిండుగా లేదు. సగం ఎండింది. సగంకొమ్మలు ఆకులు లేకుండానే ఉన్నాయి. చెట్టుకింద ఎండిపోయిన బాయి. గడ్డమీద తుప్పుపట్టిన కరెంటుమోటరు. పక్కనే చిన్న గుడిసె. ఎక్కడా మనుషుల అలికిడిలేదు. ఎక్కడో పత్తికి మందుకొడుతున్న చప్పుడు. అప్పుడప్పుడు ఘాటైన వాసన.

“తాతా...ఏది మీ తల్లి” చుట్టూ చూస్తూ అడిగాను.

అతడు బాయి చుట్టూ తిరుగుతున్నాడు. బాయిలకు తొంగిచూస్తున్నాడు. చూస్తూ చూస్తూ “ఇదే సారూ...మా గంగుబాయి. ఇది తవ్వినంకనే నేను మూడుపూటలా తిండి తిన్న. పిల్లలకింత అన్నం పెట్టిన. ఇది తవ్వుతున్నప్పుడే సారూ... నా భార్య గంగవ్వ బాయిల జారిపడి చచ్చింది. అందుకే గంగుబాయి అని పేరు పెట్టుకున్న. ఎప్పుడూ నిండుగా ఉండేది. ఇప్పుడు ఎండుకపోయింది...” ఏదో వదురుతున్నట్టుగా అంటున్నాడు.

నాకేమీ అర్థంకాలేదు. అతడివైపు పరిశీలనగా చూసాను. ఇంతకుముందులాగా లేదు. ఏదో ట్రాన్స్‌లో ఉన్నట్టుగా ఉన్నాడు. పక్కన నేను లేనట్టుగానే తనలోతాను మాట్లాడుకుంటున్నాడు.

ఏం చెప్పాలో ఏం చెయ్యాలో అర్థంకాలేదు. చుట్టూ చూస్తుంటే ఒక వ్యక్తి పరిగెత్తుకుంటూ రావడం కనిపించింది. అతడిని ఎక్కడో చూసినట్టుగా అనిపించింది. తన పేరు రాములు అని పరిచయం చేసుకున్నాడు.

“సార్...ఏమనుకోకండి.... మా నాయిన పాణం బాగలేదు. ఊర్లెకు ఎవరు కొత్త మనుషులచ్చినా ఇక్కడికి తీసుకస్తాడు. మేం ఎప్పుడు ఆయన్ను కనిపెట్టుకునే ఉంటాం. ఈ రోజు నాకు ఇంట్లో పని ఉండి మరిచిపోయా. అంతే! మీ వెంటపడ్డాడు..” బాధగా అన్నాడు రాములు.

నాకు బాధగా అనిపించింది. ఏం జరిగిందో అతడిని వివరంగా అడిగాను.

“మా నాయిన స్వంతంగా కొన్న భూమి సార్... బాయి తవ్వుకున్నాడు. నాలుగైదేండ్లు బంగారం

పండింది. ఎండిపోయి నాలుగేండ్లయింది. రెండు సైడుబోర్లు ఏసినం. రెండు సెంటర్‌బోర్లు ఏసినం. నీటి సుక్క రాలలేదు. అప్పటినుంచి ఇట్లా తయారయ్యాడు" రాములు చెప్పాడు.

నేను బాధగా తండ్రివైపు చూసాను. గుడిసెలోకి వెళ్లి కూర్చున్నాడు. కాలజ్ఞాన తత్వాన్ని పాడుతున్నాడు. భుజం మీది నుంచి తువ్వాల పరిచి కూర్చోమన్నాడు రాములు.

నేను టైం చూసుకున్నాను. రెండయింది క్యాంపుకు వెళ్లాల్సి ఉంది. కానీ కాళ్లు కదలడంలేదు. హృదయం బరువెక్కింది. ఇక్కడ నాకు అభివృద్ధికి మరో కోణం కనిపిస్తుంది. తువ్వాల మీద కూర్చుంటూ "డాక్టర్‌కు చూపించాల్సింది... పెద్దజబ్బేమీ కాదు. కౌన్సిలింగ్‌తో నయమవుతుంది" అన్నాను.

రాములు చెట్టు మొదట్లో కూర్చున్నాడు. బేలగా చూస్తూ "చూపించాం సార్. మా తమ్ముడు దవాఖానలన్నీ తిప్పాడు. అయినా లాభం లేదు." అంటూ వివరంగా చెప్పాడు. అప్పుడు తెలిసింది అతడు దేవేందర్ అన్న అని.

మార్పును దేవేందర్ ఎందుకు అంతగా ప్రతిఘటిస్తాడో అప్పుడు అర్థమయింది. గుడిసెలోంచి రాగం వినిపిస్తోంది. నాకు జాలి వేసింది. బాయి వైపు చూసాను వస్తున్న ప్రతీ మార్పుకు అనుగుణంగా ఒదిగి ఉంది. బాయికి మోటబారి ఉంది. మోటార్ ఉంది బోరుపొక్క ఉంది. చుట్టూ గడ్డి మొలచి ఎండిపోయి ఉంది.

రాములు చెబుతున్నాడు. "ఇది వందూరు భూమి సార్... గడ్డిగూడా మొలువక పోతుండె. కాలుపెడితే మోకాలిలోతు బుడుగు. ఇసుక మొరం జారవేసి నాయిననే సాగుచేసిండు. నా పుట్టుకలో రెండెకరాల భూమిలో ఐదు బస్తాల వడ్లు పండినయి. నేను పదేండ్ల పిల్లగానప్పుడు పది బస్తాలు పండినయి. ఇరవైఏండ్లు వచ్చి వ్యవసాయం చేతపట్టిన ప్పుడు ఇరువై బస్తాల పంట తీసిన. ఆ మీద ముప్పయి... ఎన్నడూ చూడని పంట... మొన్నటి దాకా నలభైబస్తాలు.. నలపై అయిదు బస్తాలు తీసినం. పంటపెరుగుతుంటే సంతోషపడ్డంగానీ ప్రమాదం భూమినుంచి వస్తుందని ఊహించలేదు..."

నేను కొద్దిసేపు రాములునే చూస్తుండి పోయాను. అతడి మాటలు నాలో ఎన్నో ప్రశ్నలను రేకెత్తించాయి. అతడు చెబుతున్నది సస్యవిప్లవం, హరిత విప్లవం తర్వాత అభివృద్ధి గురించి. బాయి ఎండిపోవడమనేది ఆ అభివృద్ధికి మరో ముఖం.

రాములు నా వైపు చూడడంలేదు. తన ఆలోచనల్లో తానున్నాడు. "నాగలితో దున్నిన నాడు నయముండె సార్. పంటకోసం పరుగులు తీస్తే భూమి ఖాళీ అయింది. రొట్టెముక్కకోసం పాముల పుట్టలో చేయి పెట్టినట్టయింది.... ఎకురం పంటకు ఎంతనీటిని భూమిల నుంచి బయటకు తీసినం..... అంతనీటిని లోపలికి పంపినమా...?"

అతడి మాటల లోతుకు అశ్చర్యమనిపించింది. ఊర్లో నేను తాగిన నీళ్లు గుర్తుకొచ్చాయి.

భూమి అడుగుపొరల్లో నీరు ఎంత ప్రమాదమో గుర్తుకొచ్చింది. వింత వ్యాధికీ నీటికీ సంబంధం ఉందా అన్న అనుమానం వచ్చింది. నా అనుమానమే నిజమైతే నేడు పల్లెలన్నీ ఖాళీ చేయాల్సిందే.

నాకు గ్లోబల్ వార్మింగ్ గుర్తుకొచ్చింది. దేవేందర్ మాటలు గుర్తొచ్చాయి. ప్రమాదం భూమిలోంచి గాలిలోంచి ఆకాశంలోంచి ఉందంటాడు. అభివృద్ధిని ఒకవైపునుంచే చూస్తూ ఫ్యాక్టరీల కాలుష్యాన్ని పోగుచేసుకుంటున్నామంటాడు. ఉత్పత్తిని ఎక్కువ చేసుకుంటున్నంత వేగంగా కాలుష్యాన్ని ఎందుకు తగ్గించుకోవడం లేదంటాడు.

లేచి నిలబడ్డాను. రాములు గూడా నాతోనే నిలబడ్డాడు.

"మా తమ్ముడు మోటగొట్టినకాలమే మంచిదంటడు సార్. అది నిజంకాదు." రాములు అన్నాడు.

"నేను సబ్‌మెర్సిబుల్ పంపులకాలమే మంచిదనుకున్నాను అదీ నిజంగాదు" గుడిసె వైపు చూస్తూ అన్నాను.

రాములు తంబ్రిముడుచుకుని పండుకున్నాడు. పాట ఆగిపోయింది. రెండుమూడుసార్లు పిలిచాను. పలుకలేదు. గుండె బరువెక్కింది కాగితంతీసి మందులు రాసిచ్చాను.

కాగితంవైపు నిర్లిప్తంగా చూసి "లాభంలేదు సార్... చికిత్స చేయాల్సింది మా నాయినకు కాదు... " అన్నాడు అంటూ 'ఇది చలికి వణికే కాలం. కానీ ఇంతవేడిగా ఎందుకుందంటారు..? కడుపునిండా తిని కష్టంచేసుకునే కాలం. లేని రోగాలు ఎందుకొస్తున్నాయంటారు...? ఎక్కడో ఏదో జరిగింది సార్... దానికి చికిత్స చెయ్యాలి' అన్నాడు.

ఏ సమాధానమూ చెప్పలేని సందిగ్ధ భావన. మనసు ఆటుపోటుల సముద్రంలా ఉంది. మార్పుకూ మార్పుకూ మధ్య వేగంలో ఎక్కడో బ్యాలెన్సింగు దెబ్బతిన్నది. అది మరోవైపు నుంచి వేగంగా విజృంభిస్తుంది.

ఎడారిలాంటి మడికట్లనుంచి పాడుబడిన వీధుల్లోంచి క్యాంపుకు వచ్చాను. రాములు నా వెంట చాలాదూరం వచ్చాడు. ఎక్కడ వెనుదిరిగాడో చూడలేదు. అభివృద్ధి పేరిట జరుగుతున్న విధ్వంసం నన్ను వెంటాడుతుంది. చెట్టు పిట్టా, గుట్టా మనిషి ప్రకృతి మొత్తం విషపుకోరల్లో చిక్కి విలవిలలాడుతున్నట్లుగా అనిపించింది. అందరు పడగనీడలో బతుకుతున్నామా అనుకున్నాను.

క్యాంపు చేరగానే సెల్ మోగింది. డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్. కొత్తకేసుల వివరాలు అడిగాడు. రిజిష్టర్‌లో లెక్కపెట్టి ఇరువై అన్నాను. అతడి గొంతలో ఉల్కిపాటు కనిపించింది. 'డాక్టర్...' అన్నాడు అరుస్తున్నట్లుగా.

తర్వాత తగ్గించి 'ల్యాబ్‌నుంచి రిపోర్టు వచ్చాయి. ఏ రీజన్ కనిపించలేదు. కారణమేమిటో తెలియడంలేదు' అన్నాడు నిరాశగా.

నాలో ఉద్వేగం పెరిగింది. "రీజన్ ల్యాబ్‌లో తేలదు సార్... ఇక్కడే తెలుతుంది. ఎందుకంటే మనం వేయిపడగల నీడలో ఉన్నాం. ఏ పడగ ఎప్పుడు విషం కక్కుతుందో తెలియదు. రేపు ఇంకే రోగాలు వస్తాయో తెలియదు. తినే తిండి, పీల్చేగాలి, తాగేనీరు, బతికే వాతావరణం...అన్నీ.... అన్నీ విషం చిమ్ముతున్నాయి సార్..." అన్నాను.

నా మాటలు ఆఫీసర్‌కు అర్థమయ్యాయో లేదో తెలియదు. సెల్ మాత్రం కట్టయ్యింది. కళ్ల ముందు దేవేందర్ కవిత్వమూ, ఎండిపోయిన బాయి కదులుతున్నాయి.

(ఆంధ్రభూమి ఆదివారం18-12-05)

(తెలంగాణ కథ 2005)